RNI. No. APTEL/2011/41055






# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక






సంపుటి : 13 సంచిక : 215 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం గురువారం, 6 ఫిబ్రవరి 2025 పేజీలు : 4 వెల : 2/-

# 'స్థానికం'పై దృష్టి పెట్టి...

## నేడు పార్టీ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్, మున్షీ భేటీ..



## 'స్థానిక' ఎన్నికలపై దిశానిర్దేశం!!

హైదరాబాద్ : తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతోంది. రెండువారాల్లో నోటిఫికేషన్ వస్తుందన్న వార్తలు హంగామా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీ వేగంగా అడుగులు వేస్తోంది. గురువారం ఎమ్మెల్యేలతో సమావేశం కావాలని పార్టీ నిర్ణయించింది. ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ ఇన్ ఛార్జ్ దీపాదాస్ మున్షీ కూడా హాజరుకానున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ చేసింది అధికార కాంగ్రెస్ పార్టీ. ఆ పార్టీ నేతలు భావించిన మాదిరిగానే ముందుగా కులగణన రిపోర్టును అసెంబ్లీ పెట్టి చర్చించింది ప్రభుత్వం.

రాజ్యాంగం ప్రకారం తెలంగాణ ప్రభుత్వం పంపిన తీర్మానాన్ని కేంద్రం ఆమోద ముద్ర వేయాలి. లేకుంటే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో కేటాయిస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు పార్టీ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్ ఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమావేశం కానున్నారు. ఎమ్మెల్యేలను జిల్లాల వారీగా నాలుగు గ్రూపులుగా విభజించనున్నారు. ఆ తర్వాత వారితో సమావేశం కానున్నారు. వీలైతే ఒక్కొక్కరితో ఇండివిడ్యువల్‌గా మాట్లాడే అవకాశమున్నట్లు గాంధీ భవన్ వర్గాల మాట.

తొలుత జిల్లాలు, నియోజకవర్గాల వారీగావున్న సమస్యలపై తొలుత చర్చించనున్నారు. ఎమ్మెల్యేల సమస్యలను తెలుసుకోనున్నారు. ఇదిలావుండగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన 10 మంది ఎమ్మెల్యేలు దానం ఇంట్లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో దానిపై కూడా చర్చించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. వీలైతే బుధవారం లేదంటే గురువారం దీపాదాస్ మున్షీ హైదరాబాద్‌కు రానున్నట్లు పార్టీ వర్గాల మాట. ఎమ్మెల్యేలతో సమావేశం తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలపై క్లారిటీ రావచ్చని అంటున్నారు కొందరు నేతలు.

అదే జరిగితే రాబోయే రోజుల్లో స్థానిక ఎన్నికలపై నగారా మోగడం ఖాయమని అంటున్నారు. ఇవేకాకుండా పార్టీ పరంగా ఉన్న అంశాలను సైతం చర్చించనున్నట్లు అంతర్గత సమాచారం.

# కులగణనపై ఎంపీ రాహుల్ గాంధీకి కేటీఆర్ సూటి ప్రశ్న..




హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వేలో బీసీ జనాభాను తగ్గించి వారిని దారుణంగా వెన్నుపోటు పొడిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పులతడకగా లెక్కలు వేసి సర్వే పూర్తయిందని చెప్పడం ముమ్మాటికీ వెనకబడిన వర్గాలను మోసం చేయడమేనని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఎమ్మెల్యే కేటీఆర్ లేఖ రాశారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ కులగణన సర్వే పూర్తి చేసిందని లోక్ సభలో మీరు (రాహుల్ గాంధీ) చెప్పడం పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించడమేనని కేటీఆర్ మండిపడ్డారు. లక్షలాది మంది వివరాలు సేకరించకుండా సర్వే ఎలా పూర్తవుతుందని రాహుల్‌ని కేటీఆర్ ప్రశ్నించారు.

**బీఆర్ఎస్ సర్వే ఇలా..** పదేళ్ల కిందట అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల సంఖ్య 1.85 కోట్లుగా తేలిందని, రాష్ట్ర జనాభాలో ఇది 51 శాతంగా ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. మైనారిటీల్లో ఉన్న బీసీలనూ కలిపితే ఆనాడు బీసీల సంఖ్య ఏకంగా 61 శాతానికి చేరిందని స్పష్టం చేశారు. అలాంటిది పదేళ్ల తర్వాత కాంగ్రెస్ సర్కార్ కులగణన సర్వేలో బీసీల జనాభా 1.64 లక్షలకు ఎలా తగ్గిందని, 46 శాతానికి ఎలా పడిపోయిందో చెప్పాలని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. దశాబ్ద కాలంలో బలహీన వర్గాల జనాభా తగ్గినట్టు చూపిన ఈ తప్పుడు లెక్కలను ఎవ్వరూ నమ్మే పరిస్థితుల్లో లేరని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. అసమగ్రంగా జరిగిన సర్వే పూర్తయిందని సాక్షాత్తూ దేశ అత్యున్నత చట్టసభలో పేర్కొనడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ధ్వజమెత్తారు.

**చూస్తూ ఊరుకోరు..** అసెంబ్లీ సమావేశాల సాక్షిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి లేదని తేలిపోయిందని కేటీఆర్ మండిపడ్డారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కి, చివరికి కాంగ్రెస్ పార్టీపరంగా మాత్రమే సీట్లు ఇస్తామని చేతులెత్తేయడం మోసం కాకపోతే మరేంటని కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ చేసిన ఈ ద్రోహాన్ని చూస్తూ ఊరుకోవడానికి తెలంగాణలోని బీసీ సమాజం సిద్ధంగా లేదని రాహుల్‌ని లేఖలో హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బీసీ రిజర్వేషన్లు పెంచుతామని మీరిచ్చిన మాటను ఏడాది కాలంలోనే మంటగలిపి బీసీల గొంతు కోశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందడమే ఏకైక లక్ష్యంగా అబద్ధాలు ప్రచారం చేసి డిక్లరేషన్లకు ఘోరీ కట్టిన పాపం కాంగ్రెస్‌ను వెంటాడటం ఖాయమని అన్నారు.

**చేతులు దులుపుకుంటారా? :** తెలంగాణలో అమలు చేయని హామీలను, ఇక్కడి ప్రజలకు అందిస్తున్నట్టు ఎలా ప్రచారం చేసుకుంటారని రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ కులగణన సర్వేను అంశాన్ని ఇతర రాష్ట్రాల్లోనూ వాడుకోవాలనే ఎత్తుగడలో భాగంగానే పార్లమెంట్‌లో దీని ప్రస్తావన తెచ్చారని ఆయన మండిపడ్డారు. కులగణన తప్పులను సవరించాల్సిన బాధ్యత మరిచి బంతిని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకోవాలని చూస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. తెలంగాణ బీసీ సంఘాల నేతలు ఏకంగా కులగణన నివేదికను చించివేసి నిరసన తెలిపారని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణన అంతా తప్పులతడకేనని చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణ ఇంకేం కావాలని అన్నారు. ఈ సర్వేతో బీసీలకు న్యాయం జరగకపోగా కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన అన్యాయం చేసిందని కేటీఆర్ దుయ్యబట్టారు.

**ఎలా తగ్గింది? :** పదేళ్లలో అగ్రవర్ణాల జనాభా పెరిగి, బీసీల జనాభా తగ్గడం ఎలా సాధ్యమో చెప్పగలరా? రాహుల్ గాంధీ అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. వెనకబడిన వర్గాల భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన కోటాను తప్పులకుప్పగా తయారు చేయడం, కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల ఉన్న నిలువెత్తు నిర్లక్ష్యానికి అద్దంపడుతోందని అన్నారు. తప్పుడు లెక్కల వల్ల రానున్న రోజుల్లో ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని బీసీ బిడ్డలు ఆందోళన వ్యక్తం చేస్తుంటే, వాస్తవాలు తెలుసుకోకుండా రాహుల్ గాంధీ మాట్లాడటం దారుణమన్నారు. బీసీలకు తీవ్ర అన్యాయం చేసే ఈ ఫెయిల్యూర్ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని పార్లమెంట్‌లో రాహుల్ కోరడం మరో విడ్డూరమని అన్నారు.

**క్షమాపణ చెప్పాల్సిందే..** ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడే కాంగ్రెస్ నిజస్వరూపం ఏడాది కాలంగా అనేక రూపాల్లో బయటపడిందని కేటీఆర్ చెప్పుకొచ్చారు. బీసీల జనాభాను తగ్గించి చారిత్రక తప్పిదం చేసిన కాంగ్రెస్ పార్టీని తెలంగాణలోని వెనకబడిన వర్గాలు ఎప్పటికీ క్షమించవని కేటీఆర్ ధ్వజమెత్తారు. గ్యారెంటీల పేరిట చేసిన గారడీని, డిక్లరేషన్ పేరిట చేసిన ఈ దగాను చూసిన తర్వాత వచ్చే స్థానిక ఎన్నికల్లోనే కాదు.. ఏ ఎన్నికల్లోనూ ఇక కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరని కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ వేదికగా బీసీ డిక్లరేషన్ ఓ నాటకమని, బీసీలకు స్థానిక ఎన్నికల్లో కల్పిస్తామన్న 42 శాతం రిజర్వేషన్ల హామీ బూటకమని తేలిపోయిందని చెప్పారు. ఈ మేరకు తెలంగాణ బీసీలకు రాహుల్ గాంధీ బేషరతుగా క్షమాపణ చెప్పాలంటూ కేటీఆర్ లేఖలో డిమాండ్ చేశారు.




# మాజీ మంత్రి హరీశ్ రావుకు భారీ ఊరట..

## అప్పటివరకూ అరెస్టు చేయొద్దంటూ ఆదేశాలు..

హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావుకు మరోసారి ఊరట లభించింది. ఈ కేసులో హరీశ్ రావును ఫిబ్రవరి 12 వరకూ అరెస్టు చేయవద్దంటూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అయితే తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ హైకోర్టును మాజీ మంత్రి ఆశ్రయించారు. క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు గతంలో విచారణ చేపట్టిన ధర్మాసనం ఆయన్ను అరెస్టు చేయవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా వాటిని పొగడిస్తూ ఈనెల 12 వరకూ అరెస్టు చేయవద్దని చెప్పింది. విచారణ సందర్భంగా ఈనెల 12న సీనియర్ లాయర్‌తో వాదనలు వినిపిస్తామని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడువు కోరారు. కాగా, ఇదే కేసులో అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, అడిషనల్ ఎస్పీ భుజంగరావుకు తెలంగాణ హైకోర్టు ఇటీవల షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో మ్నెదట వారు నాంపల్లి కోర్టును ఆశ్రయించగా.. బెయిల్ పిటిషన్‌ను రెండు సార్లు తిరస్కరించింది. దీంతో ఇద్దరూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. పది నెలలుగా జైలులో ఉన్నామని, అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

ఈ మేరకు వారికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది హైకోర్టు. రూ.లక్ష పూచీకత్తుతో రెండు షూరిటీలూ సమర్పించాలని ఆదేశించింది. అలాగే వ్యక్తిగతమైన పాస్ పోర్టులు సైతం సమర్పించాలని చెప్పింది. కేసు దర్యాప్తు కొనసాగుతున్న దృష్ట్యా పోలీసులకు సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేయొద్దంటూ భుజంగరావు, రాధాకిషన్ రావును హైకోర్టు ఆదేశించింది.




# ఢిల్లీ పీఠం ఆ పార్టీదే..

## ఎగ్జిట్‌పోల్స్ అంచనాలివే.. కేకే సర్వే రిపోర్ట్ ఏంటంటే..

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది.. సీలంపూర్, జంగ్‌పూర్, అకోలా నియోజకవర్గాలు మినహా మిగతా ప్రాంతాల్లో ప్రశాంతంగా ముగిసింది. కాగా.. సాయంత్రం 5 గంటల వరకు 58 శాతం పోలింగ్ నమోదయ్యింది. పలు నియోజకవర్గాల్లో ఆప్, బీజేపీ అభ్యర్థుల మధ్య టఫ్ ఫైట్ ఉంది. గెలుపుపై అటు బీజేపీ, ఇటు ఆప్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ కూడా కొన్ని నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఇస్తున్నట్లు పేర్కొంటున్నారు. కాగా.. ఢిల్లీలో అంచనాలను మించి పోలింగ్ శాతం నమోదవడంతో.. అంచనాల్లో పార్టీలు తలమునకలవుతున్నాయి. 2020 ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 44.52 శాతం పోలింగ్ నమోదైంది.. 2025లో సాయంత్రం 5 గంటల వరకు 58 శాతం పోలింగ్... గత ఎన్నికలతో పోలిస్తే 13 శాతం పోలింగ్ పెరిగింది.. పెరిగింది అనుకూల ఓటా..? ప్రతికూల ఓటా..? అంటూ ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అంచనావేస్తున్నాయి..

ఈ క్రమంలోనే పోలింగ్ ముగియడంతో ఎగ్జిట్‌పోల్స్ విడుదలయ్యాయి.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై జాతీయ ఛానెల్స్ ఎగ్జిట్ పోల్స్ ప్రకటించాయి.. 2020 ఎన్నికలతో పోలిస్తే 13శాతం ఓటింగ్ పెరగడంతో.. ఇది గెలుపోటములపై ప్రభావం చూపనుందని పేర్కొంటున్నాయి.. ఈ సారి బీజేపీ, ఆప్ మధ్య గట్టి పోటీ ఉందని కొన్ని ఛానెళ్లు అంచనా వేశాయి.. మరికొన్ని.. బీజేపీకి అనుకూలంగా.. ఇంకొన్ని ఆప్ గెలిచే అవకాశం ఉందని పేర్కొన్నాయి..

**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు ఇవే..** మ్యాట్రిజ్ %-% ఆప్ 32-37, బీజేపీ 35-40, కాంగ్రెస్ 0-1 స్థానాలు. పీపుల్స్ ఇన్‌సైట్- ఆప్ 25-29, బీజేపీ 40-44, కాంగ్రెస్0-1 స్థానాలు. రిపబ్లిక్ పీమార్క్- ఆప్ 21-31, బీజేపీ 39-49, కాంగ్రెస్ 0-1 స్థానాలు. కేకే సర్వే: ఆప్ 39, బీజేపీ 22, కాంగ్రెస్ 9స్థానాలు. టైమ్స్‌నౌ: ఆప్ 22-31, బీజేపీ 39-45, కాంగ్రెస్ 0-2. పీపుల్స్ పల్స్: ఆప్ 10-19, బీజేపీ 51-60. చాణక్య స్ట్రాటజీస్: బీజేపీ 39-44 స్థానాలు, ఆప్ 25-28, కాంగ్రెస్ 2-3. జేవీసీ ఎగ్జిట్‌పోల్: బీజేపీ 39-45 స్థానాలు, ఆప్ 22-31, కాంగ్రెస్ 0-2. అయితే.. ఢిల్లీ ఎగ్జిట్‌పోల్స్ ప్రకారం.. బీజేపీకే స్పష్టమైన ఆధిక్యం కన్పిస్తోంది. 25 ఏళ్ల తరువాత ఢిల్లీలో బీజేపీ గెలుస్తుందని మెజారిటీ ఎగ్జిట్‌పోల్స్ చెబుతున్నాయి. ఓట్ల శాతం పెరగడంతో బీజేపీకి అనుకూలంగా ఉంటుందన్న భావన కన్పిస్తోంది. ఢిల్లీ మొత్తం 70 స్థానాలు కాగా మెజారిటీ దక్కాలంటే 36 స్థానాలు దక్కాలి. పోల్ ఆఫ్ పోల్స్‌లో కూడా బీజేపీకే ఆధిక్యం లభించింది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## అమెరికాలో అక్రమంగా ఉన్న మనోళ్ల లెక్కంత?

రెండోసారి అమెరికా అధ్యక్షపదవిని చేపట్టిన రోజు నుంచే ఆ దేశంలో అక్రమంగా ఉంటున్న విదేశీయుల మీద ట్రంప్ ఎంత కఠినంగా ఉన్నారో తెలిసిందే. ఇప్పటికే పలు దేశాలకు చెందిన వారిని వారి దేశాలకు పంపిన అమెరికా.. తాజాగా 205 మంది భారతీయుల్ని ప్రత్యేక విమానంలో పంపే యటం తెలిసిందే. సీ17 అనే సైనిక విమానంలో వారిని టెక్సాస్ లోని శాన్ ఆంటోనియో నుంచి పంజాబ్ లోని అమ్రత్ సర్ కు వెనక్కి పంపారు. ఈ విమానం మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు బయలుదేరిన వైనాన్ని ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించారు. అమెరికా నుంచి బయలదేరిన ఈ విమానం మధ్యలో ఇంధనం నింపుకోవటానికి జర్మనీలోని రాంస్టిన్ లో ఆగింది. ఈ విమానం భారత్ కు చేరుకోనుంది. కాకుంటే.. ఈ విమానంలో తిప్పి పంపిన వైనంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విమానంలో గౌరవప్రదంగా అయితే 140 మందికి మాత్రమే ప్రయాణించే వీలుంది. అందుకు భిన్నంగా 205 మందిని తరలించటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే.. అఫ్ఘనిస్థాన్ లో తాలిబన్లు అధికారం చేపట్టిన వేళలో.. ఇలాంటి విమానాల్లో 600-800 మందిని తరలించిన వైనంతో పోలిస్తే.. ఇది తక్కువేగా అన్న వాదనను వినిపిస్తున్నాయి. అమెరికాకు మిత్రదేశంగా.. అత్యంత నమ్మకస్తుడి హెూదాలో ఉన్నప్పుడు ఇలా ఎలా వ్యవహరిస్తారు? అన్నది ప్రశ్నగా మారింది. ఇంతకూ అమెరికాలో చట్టవిరుద్ధంగా ఉన్నమనోళ్లు ఎందరు? వారిని చట్టవిరుద్ధమైన పౌరులుగా ఎలా గుర్తిస్తారు? అన్న దానిపై పలువురికి ఉన్న సందేహాలకు సమాధానాలు వెతికితే.. పలు అంశాలు వెలుగు చూస్తాయి. ఇంతకూ ఎవరిని తిరిగి పంపించేస్తున్నారు? అన్న విషయాన్నిచూస్తే.. అమెరికాలో ఉండటానికి సరైన పత్రాలు లేని.. అక్రమంగా దేశంలోకి ఎంట్రీ అయిన వారిని తిరిగి పంపుతున్నారు. ఇలా తిప్పి పంపే వారి కోసం వాణిజ్య.. సైనిక అవసరాల కోసం వినియోగించే భారీ విమానాల్ని వినియోగిస్తున్నారు. మరి.. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులు ఎందరు? అన్నది మరో ప్రశ్న. దీనికి బ్లూంబర్గ్ అంచనా ప్రకారం 18వేల మంది వరకు భారతీయుల్ని ఇప్పటివరకు గుర్తించినట్లు చెబుతున్నారు. అమెరికా హెూంలాండ్ అధికారుల లెక్కల ప్రకారం 20,407గా చెబుతునరు. వీరి నుంచి సరైన పత్రాలు లేవని చెబుతున్నారు. ఇందులో 17,940 మందిని వెనక్కి పంపేందుకు తుది ఉత్తర్వులు జారీ చేసినట్లుగా చెబుతున్నారు. అయితే ఇవన్నీ 2022 నాటి లెక్కలని.. ప్రస్తుతం మరింత ఎక్కువ మంది ఉన్నట్లుగా భావిస్తున్నారు. పలు నివేదికల ప్రకారం అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయుల సంఖ్య దగ్గర దగ్గర 7,25,000 మంది ఉంటారని చెబుతున్నారు. ఇంత భారీ సంఖ్యలో భారత్ కు తిరిగి వస్తే.. అదో పెద్దతలనొప్పిగా మారుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవ కోణంలో అంత మందిని తరలించటం సాధ్యమేనా? అన్నది మరో ప్రశ్న.

# సమస్యలకు చికిత్స చేయండి




కరీంనగర్ : నన్ను అందరూ పెద్ద దవాఖానా అని పిలుస్తారు. రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించడంలో నిధులు లేక నిరుపేదగా మారాను. నన్ను నమ్ముకొని ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులతోపాటు, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలోని కొంతమంది ఇక్కడకు వస్తుంటారు. రెండేళ్ల కిందట వైద్య విధాన పరిషత్‌లో ఉన్న నన్ను వైద్య కళాశాలలోకి మార్చారు. జిల్లావాసులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందిస్తానని ఆశించాను. కానీ నిధులు లేకపోవడంతో రోగిగా మారాను. జిల్లాయంత్రాంగం, ప్రజాప్రతినిధులు నా సమస్యను అర్థం చేసుకొని నిధులు కేటాయిస్తారని లేఖ రాస్తున్నాను. ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. నా దగ్గర ట్రామా కేర్ లేకపోవడంతో సుమారు 4000 మంది తీవ్రగాయాలై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. ఆ సేవలు అందుబాటులో లేక ప్రైవేట్ దవాఖానాకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు చేసి అప్పులపాలయ్యారు.

జిల్లాలో క్యాన్సర్ మహమ్మారి పెరిగిపోతోంది. నా వద్ద సరైన సేవలు లేకపోవడంతో.. ఉమ్మడి జిల్లాలోని సుమారు 90 వేల మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. కరీంనగర్‌లో పేదోడి గుండెపోటుతో నా గుండె పగులుతోంది. నా వద్ద చికిత్స లేక ఉన్నతాసుపత్రికి తీసుకెళ్లడానికి సమయం లేక ప్రైవేట్‌లో చేరి గుండెలు కరిగేలా రోదిస్తున్నారు.

ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉండటం నాకే 'వ్యర్థ'మనిపిస్తోంది. బిల్లులు చెల్లించాలనే సరికి చిన్న ఆసుపత్రిలా 'లెక్క'లు కడుతున్నారు. వారికి పెద్ద ఆసుపత్రిలా కనిపించడం లేదా? అని అనిపిస్తుంది. 542 పడకల ఆసుపత్రికి 330 పడకలకు మాత్రమే పారిశుద్ధ్య బిల్లు చెల్లిస్తున్నారంటే అధికారులకు నాపై ఎంత అ'శ్రద్ధ' పెట్టారో అర్థమవుతోంది.

వైద్యుల చేతిలో పరికరాలు లేకపోవడంతో వారు శస్త్రచికిత్స గదిలో చెందుతున్న ఆవేదన చూసి నాకెప్పుడు 'శస్త్రచికిత్స' చేస్తారో అని మదనపడిన రోజులెన్నో. నా వద్ద సేవలందక మా పెద్దాసుపత్రి వరంగల్‌కు పంపుదామంటే అంబులెన్సులు లేవు. మరమ్మతుల్లేక మూలన పడి ఉన్నాయి.నాలోని యంత్రాలు సరిగా పనిచేయడం లేదు. ఎక్స్‌రేలకు ఫిల్మ్‌లు, పరీక్షలకు ప్రింటెడ్ నివేదికలు ఇవ్వడానికి డబ్బులు లేకపోవడంతో ఎంత పనిచేసిన నాకు గుర్తింపు రావడంలేదనే ఆవేదన మిగిలింది. జిల్లాలో పేరుమోసిన ప్రజాప్రతినిధులున్నా..నన్ను పట్టించుకునేవారు లేరు.ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కున ఉన్న నాకు దయచేసి కిడ్నీ, గుండె, న్యూరో, క్యాన్సర్, వైద్యులతోపాటు ఎంఆర్ఐ, సీటి, అబ్డామిన్, ఎక్సరే, యంత్రాలు, శస్త్రచికిత్స గది 24 గంటలు పనిచేసేలా నిధులు మంజూరు చేయగలరని కోరుకుంటున్నాను.

# సహకార సంఘాలకు ప్రత్యేక పాలన తప్పదా?

కరీంనగర్ : సహకార సంఘ పాలకవర్గాల పదవీకాలం పది రోజుల్లో ముగియనుంది. కొత్త పాలకవర్గాల ఏర్పాటుపై ప్రభుత్వం ఇప్పటివరకు నిర్ణయానికి రాలేదు. దీంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఆరు నెలల ముందుగానే ఎన్నికల ప్రక్రియ మొదలవ్వాల్సి ఉండగా.. ఇప్పటివరకు ఊసేలేదు. 2020 ఫిబ్రవరి 13న ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. తర్వాత రోజు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, జిల్లా మార్కెటింగ్ సొసైటీల పాలకవర్గాల సభ్యులను ఎన్నుకున్నారు. వారి పదవీకాలం సైతం ఈనెల 14న ముగియనుంది.

**రెండు నుంచి మూడు సంఘాలకు..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2-3 సంఘాలకు ఒక మండల స్థాయి అధికారిని నియమించే అవకాశాలు ఉన్నాయి. కొత్త జిల్లాల స్థాయిలో సహకార బ్యాంకుల విస్తరణ ఉండకపోవచ్చని తెలుస్తుంది. ఉమ్మడి జిల్లా పరిధిలోనే జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఉంది. కొత్త జిల్లాలు ఏర్పడినపుడు ఆయా జిల్లా స్థాయిలో సహకార బ్యాంకులను విస్తరించాలని ప్రభుత్వం సూచించింది.

**బ్యాంకుల విస్తరణ ఏమైనట్టు..**

జిల్లాలో సహకార బ్యాంకులు విస్తరించాలనే ప్రతిపాదనలు పంపినా..



నేటికి స్పందన రాలేదని తెలుస్తోంది. రైతులు దీర్ఘకాలిక, పారిశ్రామిక రుణాలు పొందే విషయంలో ఉమ్మడి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. ఈ క్రమంలో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విస్తరించాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.


**కొత్తగా 39 సంఘాలు?**

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలో 135 సహకార సంఘాలకు తోడుగా మరో 39 సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని ఆయా జిల్లాల సహకార అధికారుల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. వీటిని ఏర్పాటు చేసిన తర్వాతే ఎన్నికలు జరగవచ్చనే ప్రచారం జరుగుతోంది.

**ఆదేశాలు రావాల్సి ఉంది**

సహకార సంఘ పాలకవర్గాల పదవీకాలం పది రోజుల్లో ముగియనుంది. వారి స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించే విషయంలో ఆదేశాలు రాలేదు. అలాగే కొత్త సంఘాల ఏర్పాటు విషయంలోనూ ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు చేయలేదు. ఎన్నికల విషయంలో ఆదేశాలు వస్తేనే ప్రక్రియ ప్రారంభిస్తాం.రామానుజాచార్యులు, జిల్లా సహకార అధికారి

# పొదుపు మరిస్తే గడ్డుకాలమే!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలో 1,218 గ్రామ పంచాయతీలు రెండు నగరపాలక సంస్థలు, 14 పురపాలికల్లో వచ్చే వేసవి నాటికి తాగునీటి కష్టాలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత కనిపిస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జనవరి నెలలోనే పలు గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అవరోధాలు ఎదురవుతున్నాయి. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలతోపాటు పలు చెరువుల్లోని నీటిని శుద్ధి చేసి మిషన్ భగీరథ ద్వారా ఇళ్లకు నీళ్లందించే ప్రక్రియలో అక్కడక్కడ ఇబ్బందులున్నాయి. ముఖ్యంగా జగిత్యాల జిల్లాలోని 5 బల్దియాలకు, 346 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా నీళ్లందే విషయంలో లోపాలు పూర్తిగా తొలగిపోలేదు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లోనూ 20శాతం గ్రామాలకు నీరందించే పథకాలదీ ఇదే పరిస్థితి. ఇంట్రా పైప్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం శాపంగా మారింది. ఇప్పటి నుంచే అధికారులు దృష్టి పెడితే వేసవిలో తాగు నీటి ఎద్దడి దరిచేరదు.

**సాగు అవసరాలకు వినియోగం**

ప్రధాన జలాశయాల్లోని నీటిని సాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎల్ఎండీ నుంచి ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని పంటలకు కాకతీయ కాలువ ద్వారా నిత్యం 4,229 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో గతేడాదితో పోలిస్తే ఈసారి ఇక్కడి జలాశయంలో నీటి మట్టం కొంత తగ్గింది. ఇదే తరహాలో వరి పంట కోసం ఏప్రిల్‌లోనూ చివరి తడికి నీళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. జాగ్రత్తగా నీటిని వినియోగించకుంటే వేసవిలో కరీంనగర్ కార్పొరేషన్‌లో తాగునీటి అవసరాలకు తిప్పలు పడాల్సి వస్తుంది. ఎల్లంపల్లి, మధ్యమానేరు జలాశయాలలో నీటి నిల్వ బాగున్నా.. పొదుపుగా వినియోగిస్తేనే వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. గతేడాదితో పోలిస్తే జగిత్యాల జిల్లాలో 15 శాతం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 6 శాతం లోటు వర్షపాతం నమోదైంది. కురిసిన వర్షాలు, నిల్వ ఉన్న నీళ్లను ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకోకుంటే తీరని నష్టం, కష్టం వాటిల్లే వీలుంది.

**లోపాలు సవరిస్తేనే!**

మిషన్ భగీరథ ద్వారా నాలుగు జిల్లాల్లో రూ.3,300 కోట్లు వెచ్చించి 1,351 నీటి ట్యాంకులను నిర్మించారు. 7,692 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. పంచాయతీలతోపాటు మరో 1,126 అనుబంధ గ్రామాలకు తాగునీటి సరఫరాను మెరుగుపర్చారు. అయితే 12 నియోజకవర్గాల పరిధిలో ఆరు గ్రిడ్‌ల ద్వారా శుద్ధ జలాలను అందించే విషయంలో ఇంకా లోపాలున్నాయి. ముఖ్యంగా 18,970 మోటార్లను ఏర్పాటు చేయగా వీటిలో నిత్యం సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. రహదారులు, వాగులు, రైల్వే లైన్ల వద్ద భూగర్భ పైప్‌లైన్లలో లీకేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని నీటి సంప్‌లకు నీరు అందని దుస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఇలాంటి లోపాలను సవరించి తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. 'వచ్చే వేసవిలో తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా తగు శ్రద్ధ వహించాలి. ఇప్పటి నుంచే నీటి వనరుల్లో ఉన్న జలాలను సంరక్షించండి. లోపాలను సవరించుకోండి' ఇటీవల మంత్రి సీతక్క పంచాయతీ

# ప'రేషన్..'!

పెద్దపల్లి : జిల్లాలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లోని రేషన్ సరకులకు దూర భారం తప్పడం లేదు. కిలోమీటర్లు కాలినడకన వెళ్లి సరకులు తీసుకొచ్చే పరిస్థితి నెలకొంది. అయిదేళ్లుగా కొత్త చౌక ధరల దుకాణాల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైంది. ప్రతి నెల సమీపంలోని గ్రామాల రేషన్ దుకాణాలకు వెళ్లాల్సి వస్తోంది. పంచాయతీ సభలు, సమావేశాల్లో విన్నవించిన ప్రజల విజ్ఞప్తులు బుట్టదాఖలవుతున్నాయి. పూర్వ పంచాయతీల్లో నుంచి సరుకులు తీసుకురావడంతో సక్రమంగా అందడంలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ దుకాణాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**జిల్లాలో ఇలా..**

14 మండలాల్లో 413 రేషన్ దుకాణాలున్నాయి. జిల్లాలో ఆహారభద్రత 2,07,231, అంత్యోదయ 12,290, అన్నపూర్ణ 156 మొత్తం 2,19,677 కార్డులున్నాయి. వీటిలో 6,25,090 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. అంత్యోదయ కార్డుకు నెలకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుకు 10 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ప్రతి నెల 322.31 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం అవుతాయి.

**ప్రతిపాదనలకు మోక్షం కరవు**

జిల్లాలో మొత్తం 267 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 65 కొత్త పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. వీటిల్లో ప్రతి నెల రేషన్ సరకులు తెచ్చుకునేందుకు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కొత్త పంచాయతీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించారు కానీ.. అయిదేళ్లు దాటినా ఆచరణ సాధ్యం కావడం లేదు. కొన్ని గ్రామ పంచాయతీల్లో తక్కువ రేషన్‌కార్డులు ఉన్నాయని.. ఇలాంటి చోట్ల రేషన్ దుకాణాల మంజూరు సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. అయితే రేషన్ దుకాణాలు లేని ఊళ్లలోకి డీలర్లు సరకులు తీసుకెళ్లి పంపిణీ చేయాలని గతంలో ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు ఎవరు ఎక్కడ పంపిణీ చేయాల్సి ఉంటుందో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ డీలర్లకు దిశానిర్దేశం చేశారు. అయితే క్షేత్రస్థాయిలో ఆశించిన మేర పర్యవేక్షణ కొరవడటం, డీలర్లు ప్రాథమిక ఆదేశాలను విస్మరించడంతో కొత్త గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇది పెద్దపల్లి మండలం బొంపెల్లి పంచాయతీ పరిధిలోని మేరపల్లి. ఇక్కడ రేషన్ దుకాణం మంజూరు చేయాలని గ్రామస్థులు ప్రజావాణిలో కోరారు. స్థానికంగా చౌకదారుల దుకాణం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇవీ సమస్యలు

పూర్వ పంచాయతీ దూరం ఉండటంతో సరకులు తీసుకోవడం కష్టసాధ్యమవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

వినియోగదారులకు ఎప్పుడు పంపిణీ చేస్తారో సమాచారం కొరవడుతోంది.


డీలర్ల వద్దకు సమయానికి వెళ్లకపోవడంతో సరకులు కోల్పోవాల్సి వస్తోంది. పేదలు, దివ్యాంగులు, వృద్ధులు కష్టాలు పడుతున్నారు.

సరకులు తీసుకోవడం ఇబ్బందిదాడి సంతోష్, మేరపల్లి, పెద్దపల్లి మండలం

మా గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడతో బొంపెల్లికి వెళ్లి తీసుకొస్తున్నాం. చాలాసార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం. సమాచార లోపంతో పేదలకు నిత్యావసర సరకులు అందడం లేదు.

# చెత్త శుద్ధీకరణపై ఆశలు

కరీంనగర్ : నగరంలోని డంపింగ్‌యార్డు గుట్టలుగా పేరుకుపోతుంది. నిత్యం టన్నుల కొద్ది వస్తున్న చెత్త ఎక్కడ వేయాలనే ప్రశ్నకు జవాబే లేదు. రెండేళ్ల కిందట ప్రారంభించిన బయోమైనింగ్ పూర్తి స్థాయి పరిష్కారానికి దారి చూపించలేక పోయింది. 'కరీంనగర్ నగర ప్రజల ప్రధాన సమస్య డంపింగ్‌యార్డు అని అర్థమైంది. దీనిని పరిష్కరించేందుకు సాంకేతికతతోపాటు నిధులు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.' అని ఇటీవల నగరానికి వచ్చిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అన్నారు. కేంద్ర మంత్రి హామీతోనైనా సమస్య పరిష్కారం కావాలని నగరవాసులు కోరుకుంటున్నారు.చెత్త నిండిపోవడంతో డంపింగ్‌యార్డు నుంచి మంటలు రావడం, పొగ వ్యాపించడంతో పరిసరాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. కోతిరాంపూర్, అలుగునూర్, రామగుండం బైపాస్‌రోడ్డు, పోచమ్మవాడ, అలకాపురికాలనీ, కమాన్ ప్రాంతం వరకు వాసన వస్తోంది. దీనిని ఇక్కడి నుంచి తరలించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అయితే చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తుండటంతో అధికారులు సైతం ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారు.స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా 31 నెలల కిందట రూ.16.50 కోట్లతో బయోమైనింగ్ ప్రారంభించారు. ఏడాదిలోగా డంపింగ్‌యార్డు పూర్తిగా శుభ్రం చేసి ఇవ్వాల్సి ఉండగా ప్రక్రియ నిలిచిపోయింది. పలుమార్లు నోటీసులు ఇచ్చినా పనుల పురోగతి మాత్రం కనిపించడంలేదు. శుద్ధి చేసిన చెత్త వేసేందుకు కూడా స్థలం లేకపోవడం, రోజు వారీ వ్యర్థాలను అందులోనే కలిపి వేయడంతో శుద్ధీకరణ ప్రశ్నార్థకంగా మారింది.ఇతర రాష్ట్రాల్లో చెత్తను శుద్ధి చేసి తరలిస్తున్నట్లుగానే ఇక్కడ కూడా సాంకేతికను జోడించి వ్యర్థాలను తరలించే అవకాశముంది.



ప్రస్తుతమున్న నిల్వలతోపాటు నగర వీధుల్లోంచి చెత్తను ఎప్పటికప్పుడు శుద్ధీ చేసేలా ప్రణాళికలు చేయనున్నట్లు సమాచారం. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కూడా ఈ డంపింగ్‌యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతోనే కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.తడి, పొడి చెత్తను వేర్వేరు చేయాలి. తడి చెత్తను సేంద్రియ ఎరువు తయారీకి ఉపయోగించవచ్చు. మరోవైపు హుజూరాబాద్‌లో పొడి చెత్తతో విద్యుత్తు తయారు చేసే ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన కూడా చేశారు. ఆ ప్రక్రియ పూర్తయితే డంపింగ్ యార్డులోని చెత్త నిల్వలు తగ్గుముఖం పడతాయని అధికారులు భావిస్తున్నారు. కరీంనగర్‌లోని డంపింగ్‌యార్డు

డివిజన్లు : 60
నగర విస్తీర్ణం : 65.33 చ.కిమీ
ఇళ్ల సంఖ్య : 89 వేలు
చెత్త ఉత్పత్తి : 140 మెట్రిక్ టన్నులు(రోజుకు)
పేరుకుపోయిన వ్యర్థాలు : 3 లక్షల టన్నులు
శుద్ధి చేసింది : 80 వేల మెట్రిక్ టన్నులు

# సమయపాలనే.. విజయానికి సోపానం

మిర్యాలగూడ : ఒక తరగతిలో 50 మంది విద్యార్థులుంటే.. పరీక్షల్లో అందరూ ఒకే రకమైన మార్కులు సాధించలేరు. ఏదేని ఒక ఉద్యోగ అర్హత పరీక్షలో సైతం అందరూ ఉద్యోగాలు సాధించలేరు. వీరిలో అనేక మంది ఒకే విధమైన పుస్తకాలు చదివినప్పటికీ ఒకే రకమైన ఫలితాలు సాధించబోరు. దీనికి ప్రధాన కారణం వారు రూపొందించుకున్న ప్రణాళిక, ఆ ప్రణాళికలను అమలు చేసే తీరు.. సమయపాలన. ఏ రంగంలో విజయం సాధించాలన్నా..కష్టపడడం ఒక్కటే కాకుండా..విజయానికి కావాల్సిన అన్ని రకాల వనరులు సక్రమంగా సమకూర్చుకోవాలి. వీటిలో ప్రధానమైన వనరు సమయం. అనేక మంది తమకు సమయం లేదు..అనే మాటను తరచూ ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం అనేక రంగాల్లో అద్భుతాలు సాధించిన వ్యక్తులకు..వరుసగా అపజయాలు చవిచూస్తున్న వారికి రోజులో 24 గంటలు మాత్రమే ఉంటాయి. ఆ సమయాన్ని వినియోగించుకునే తీరు..ఏ పనికి ఎంత సమయం కేటాయించాలనే ప్రణాళిక ఉంటే విజయం సాధించడం అంత కష్టమేమీ కాదు.

**త్వరలో పరీక్షలు, ఉద్యోగ నోటిఫికేషన్లు...**

రాష్ట్రంలో మార్చి 5 నుంచి ఇంటర్, 21 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వీటితో పాటు వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల కోసం రెండు, మూడు నెలల్లో నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. వీటిలో డీఎస్సీ, ఎస్సై, కానిస్టేబుల్, గ్రూప్-1, గ్రూప్-2 తదితర పోస్టులు ఉండనున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 2 లక్షల మందికి పైగా



వివిధ పరీక్షలకు సన్నద్ధం అవుతుండగా..సుమారు 5వేల మందికి పైగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల కోసం పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

**సామాజిక మాధ్యమాలను వీడండి..**

ప్రస్తుతం సమాజంలో రాజ్యమేలుతున్న సామాజిక మాధ్యమాలకు ఎంత దూరంగా ఉంటే అంత సమయం మిగులుతుంది. పరీక్షలు, చదువుకు ఉపయోగపడే వాట్సాప్, టెలిగ్రామ్ వంటి మాధ్యమాలను రోజులో కొంత సమయం కేటాయిస్తూ..ఆ సమయాన్ని కచ్చితంగా అమలు చేయాలి. మిగిలిన అన్ని మాధ్యమాలను కనీసం పరీక్షలు పూర్తయ్యే వరకైనా పక్కన పెట్టాలి. అనవసర ఫోన్ కాల్స్, కాలక్షేప పనులు విడిచిపెట్టాలి. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండే అనేక మంది తమ లక్ష్యాల సాధనలో విజయాలు సాధిస్తున్నారు.

సమయం సద్వినియోగానికి నియమాలు..
ముందస్తు ప్రణాళిక రూపకల్పన
పనులకు ఆటంకం కలిగించే వాటిని దూరం పెట్టాలి.
ఆరోగ్యానికి కొంత సమయం కేటాయించాలి.
ఒకేసారి ఎక్కువ పనులు చేస్తూ ఒత్తిడికి గురికావొద్దు.
మీ లక్ష్యాలను దెబ్బతీసే పనులకు దూరంగా ఉండాలి.

చరవాణి పక్కన పెట్టి:
యరెడ్ల వేణుధర్‌రెడ్డి, సహాయ మేనేజర్ (హెచ్‌ఆర్) -జెన్కో (మిర్యాలగూడ)

2018లో ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలకు ముందు మూడు నెలల పాటు చరవాణిని పక్కన పెట్టి చదువుకు మాత్రమే సమయాన్ని కేటాయించాను. ఒక ప్రణాళిక రూపొందించుకుని రాత్రి వేళలో తగినంత నిద్రపోవడంతో పాటు..రోజు మొత్తంలో ఏకాగ్రతతో 10 నుంచి 12 గంటల పాటు చదివాను. ఎంత సేపు చదివామనే దానికంటే..ఎంత ఏకాగ్రతతో చదివామన్నదే ఉద్యోగ సాధనలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏ పుస్తకాలు చదువుతున్నాం, పరీక్ష సమయానికి అనుకూలంగా సిలబస్ పూర్తి చేయడం, రివిజన్ చేసుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇలా చదువుతూ ఉద్యోగ అర్హత పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాను.

సామాజిక మాధ్యమాల వినియోగం తగ్గాలి:
చారుగుండ్ల రాజశేఖర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, కోదాడ

ప్రస్తుత రోజుల్లో స్మార్ట్‌ఫోన్ లేని విద్యార్థి లేరు..సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు లేని వ్యక్తి లేడు అంటే అతిశయోక్తి కాదు. అయితే పరీక్షల సమయంలో ఈ సామాజిక మాధ్యమాల వినియోగాన్ని ఎంత మేర తగ్గిస్తే అంత మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుంది. దీంతో పాటు ఒక టైమ్ టేబుల్ ఏర్పాటు చేసుకుని..పరీక్ష తేదీల ప్రకటనకు ముందే సిలబస్ పూర్తి చేసుకుని..తేదీల ప్రకటన తర్వాత రివిజన్‌పై దృష్టి సారిస్తే విజయం సాధించడం సులభమవుతుంది.

# నిధులున్నా.. నిర్లక్ష్యమే..!

నల్గొండ : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. విడతల వారీగా ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్)ను మంజూరు చేస్తోంది. సీసీ రహదారులు, మురుగు కాల్వలు, సామాజిక భవనాలు, ప్రభుత్వ స్థలాలకు ప్రహరీలు, తాగునీరు, విద్య, వైద్యం తదితర అవసరాలకు వీటిని వినియోగించాలి. నిధులున్నప్పటికీ... క్షేత్రస్థాయిలో పనులు నెమ్మదించాయి. బిల్లులు సకాలంలో రాకపోవడంతో గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదని సంబంధిత శాఖల అధికారులు పేర్కొంటున్నారు. గతేడాదికి సంబంధించిన పనులు పూర్తి కాకపోయినప్పటికీ..ఇటీవల ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మంజూరైన పనులు: 1337.. పూర్తి: 51జిల్లా వ్యాప్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌డీఎఫ్ ద్వారా 1337 పనులు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటి వరకు 51 మాత్రమే పూర్తయ్యాయి. 89 పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

# పది ఫలితం.. లక్ష్యం శతశాతం



సంగారెడ్డి : పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. జిల్లాలోని అన్ని పాఠశాలలకు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాలు జారీ చేశారు. అధికారులకు కేటాయించిన పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాలి. పదో తరగతి విద్యార్థులు ఎలా చదువుతున్నారో పరిశీలించాలి. కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా.. విద్యార్థులు ఎలా చదువుతున్నారు.. ఉపాధ్యాయులు వారిని పరీక్షలకు ఎలా సన్నద్ధం చేస్తున్నారనే విషయాలపై ప్రధాన దృష్టి సారించాలి. ఆయా వివరాలను కలెక్టర్‌కు నివేదిక రూపంలో సమర్పించాలి. ప్రభుత్వ బడుల్లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా చర్యలు చేపట్టాలి.

**వారంలో రెండు రోజులు..**

జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఆదర్శ, కస్తూర్బా విద్యాలయాలు 239 ఉన్నాయి. వీటికి ప్రత్యేకాధికారులను నియమించారు. వారు కేటాయించిన బడుల్లో వారంలో రెండు రోజులు పర్యటించాలి. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి ఉపాధ్యాయుల బోధన ఎలా ఉంది.. పిల్లలు చదువుతున్నారో తెలుసుకోవాలి. పదో తరగతి విద్యార్థుల కోసం విద్యాశాఖ ప్రకటించిన ప్రణాళిక అమలు, నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల సద్వినియోగంపై ఆరా తీయాలి. సాయంత్రం అల్పాహారం పంపిణీపై వివరాలు సేకరించాలి. ప్రాక్టిస్-1 పరీక్షలు ఈ నెల 4న ముగియనున్నాయి. ఈ పరీక్షల్లో విద్యార్థులు ఎన్ని మార్కులు సాధించారో పరిశీలించాలి. వెనుకబడిన వారికి ప్రత్యేక బోధన చేసేలా చర్యలు తీసుకోవాలి. పాఠశాలకు విద్యార్థులు హాజరు కాకుంటే.. ఎందుకు రావడంతో తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడేలా సూచించాలి. వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని చదివిస్తున్నారా.. లేదా? అనే విషయాన్ని ప్రత్యేకాధికారులు గమనించాలి. వారికి కేటాయించిన పాఠశాలల్లో ఎక్కువ మంది పిల్లలు 10 జీపీఏ సాధించడంతో పాటు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి. తనిఖీ నివేదికలను కలెక్టర్‌కు ఎప్పటికప్పుడు పంపించాలి.

**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ:**వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

ప్రతి పాఠశాలకు ప్రత్యేకాధికారిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారు వారంలో రెండు రోజులు కేటాయించిన పాఠశాలలకు వెళ్లాలి. విద్యార్థులు ఎలా చదువుతున్నారో పరిశీలించాలి. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా సూచనలు చేయాలి. శతశాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఆదర్శ, కస్తూర్బా విద్యాలయాలు: 239
వాటిలో పదో తరగతి విద్యార్థులు: 12472

# 'అపార్' ఆరో స్థానం



సిద్దిపేట: జిల్లాలో 'అపార్' నమోదు వేగవంతమైంది. రాష్ట్రంలో 6వ స్థానంలో నిలిచింది. మొత్తం 49.26 శాతం మేర ప్రక్రియ పూర్తయింది. మరోవైపు జిల్లాలో జూనియర్ కళాశాలలు చివరి స్థానంలో నిలిచాయి. మొత్తం 1,82,669 మంది విద్యార్థులు ఉండగా.. ఇప్పటి వరకు 89,978 మంది నమోదు పూర్తయింది. ఇంకా 92,691 మంది మిగిలి ఉన్నారు. శతశాతం పూర్తయిన జాబితాలో 30 పాఠశాలలు ఉండటం గమనార్హం. 15 రోజులుగా వేగవంతమవగా.. ప్రభుత్వ పాఠశాలలు ముందు వరుసలో నిలిచాయి. ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

**భవిష్యత్తులో అనివార్యం**

రెండో తరగతి మొదలు ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు చేపట్టారు. 'వన్ నేషన్ - వన్ స్టూడెంట్'లో భాగంగా విద్యార్థి సర్వ సమాచారాన్ని నిక్షిప్తం చేసే ఈ క్రతువును గత సెప్టెంబరు 25 నుంచి చేపట్టిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో కీలకంగా మారనున్న 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు పొందడం అనివార్యం. జేఈఈ, నీట్, ఇతరత్రా పరీక్షలు రాయాలంటే అపార్ ఐడీ అవసరమంటూ ఇటీవల ఎన్‌టీఏ ప్రకటించింది. జిల్లాలోని జూనియర్ కళాశాలలు వెనుకబడి ఉండటం గమనార్హం.

**'ఆధార్' కేంద్రాల వద్ద అపసోపాలు**

అపార్ జారీలో భాగంగా ప్రాథమిక స్థాయిలో విద్యార్థి పేరు, ఇంటి పేరు, జెండర్ పక్కాగా ఉండాలి. అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలి. మరింత వేగంగా ముందుకు సాగేలా.. యాజమాన్యాలు దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆధార్ కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆపసోపాలు పడుతున్నారు. సరైన ధ్రువపత్రాలు లభించక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

**సవరణ ముగిసినట్లేనా**

పాఠశాలల్లోని అడ్మిషన్ రికార్డుల్లో అక్షర దోషాల సవరణకు శుక్రవారం (జనవరి 31వ) చివరి రోజుగా అధికారులు నిర్ణయించారు. పీఎస్, యూపీఎస్ స్థాయిలో ఎంఈవోలకు అవకాశం కల్పించగా.. ప్రత్యేకించి ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు సంబంధించి డీఈవో నేతృత్వంలో సంబంధిత సవరణ (యూడైస్‌ం సైట్ వేదికగా) జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో 119 సదరు విద్యాలయాలు ఉండగా.. చివరి ఒక్క రోజులో 23 పాఠశాలల నుంచి వందల సంఖ్యలో సవరణకు దరఖాస్తులు వచ్చినట్లు సవరణ విభాగం అధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మరిన్ని పాఠశాలల్లో సవరణలు ఉన్నా.. ఎలాంటి స్పందన లేకపోవడంతో తరువాత పరిస్థితి ఏమిటా అనే ప్రశ్న తల్లిదండ్రుల్లో ఉత్పన్నమవుతోంది. విద్యార్థి సాధించిన అంశాలు అపార్‌లో నమోదవుతాయని, అన్ని ధ్రువపత్రాల జారీకి ఇదే కీలకం కానుందని.. అన్ని విద్యాసంస్థలు నమోదు చేపట్టాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, గణాంక విభాగం అధికారి నర్సింలు తెలిపారు.

# మారుమూల రోడ్లకు మహర్దశ



నర్సాపూర్: మారుమూల తండాల రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులతో మట్టి, కంకర రోడ్లు తారుగా మారుతుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శివ్వంపేట మండలంలో పలు తండాల్లో తారు రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి.

**భారీగా నిధులు మంజూరు**

నర్సాపూర్ నియోజకవర్గంలోని శివ్వంపేట మండలంలో చాలా వరకు తండాలున్నాయి. ఎస్టీ ఎస్డీఎఫ్ ద్వారా ఇక్కడ తారు రోడ్ల నిర్మాణానికి పెద్దఎత్తున నిధుల మంజూరయ్యాయి. గతంలో రూ.55కోట్లతో అన్ని తండాల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం తారు రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని 30తండాలకు తారు రోడ్ల నిర్మాణంకు ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులు రూ.69.41కోట్లు మంజూరయ్యాయి. వీటితో శివ్వంపేట మండలం చండి-బిజిలీపూర్ మాల్యా తండా, చండి-రూప్‌సింగ్ తండా, చండి-గంగాయపల్లి తండా, పెద్దగొట్టిముక్ల వెంక్యా తండా, ఎస్ఎన్‌టి రోడ్డు-సామ్యా తండా, గడ్డమీది తండా-మాసాయిపేట మార్గాల్లో తారు రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. వీటితో పాటు నవాబుపేట-రాంలా తండాకు 1-9 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.41కోట్లతో తారు రోడ్డు వేస్తున్నారు. గూడూరు-చెన్నాపూర్ సామ్యాతండా మూడు కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.35కోట్లు, సికింద్లాపూర్ పిట్టలవాడకు 1-9కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.54కోట్లు కేటాయించారు.

**నాణ్యతగా పనులు:నాగరాజు, డీఈ, ఆర్‌అండ్‌బీ**

రోడ్ల నిర్మాణం పనులు ఏఈల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాల ప్రకారం జరిపిస్తున్నాం. శివ్వంపేట మండలం మినహా మిగతా మండలాలకు గుత్తేదారులు ముందుకు రాలేదు. బిల్లులు సకాలంలో రావడం లేదనే కారణంతో పనులు చేయడానికి ముందుకు రావడం లేదు.

# రుణ పరిమితి పెంపు... అన్నదాతకు ఇంపు

సూర్యాపేట : కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని 1998లో అన్నదాతల అవసరాల నిమిత్తం అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్డు ద్వారా వ్యవసాయ రంగంతోపాటు మత్స్య, పశుసంవర్ధక రంగాల వారు స్వల్పకాలిక రుణాన్ని పొందేలా చర్యలు తీసుకుంది. ఇదివరకు రూ.3 లక్షల రుణపరిమితి ఉండగా తాజాగా బడ్జెట్లో రూ.5 లక్షలకు పెంచింది. ఈ కార్డులతో వ్యవసాయం సహా ఎరువులు, పురుగుమందులు, విత్తనాల కొనుగోలు, కూలీల ఖర్చు, పంట కోత ఖర్చులు వంటి అవసరాల కోసం రుణం తీసుకునే సదుపాయం కల్పించింది. వీటితో బీమా సదుపాయం కూడా ఉంది.

**1.25 లక్షల మంది మాత్రమే వినియోగం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,08,810 మంది రైతులు ఉన్నారు. వీరిలో 1.25 లక్షల మంది మాత్రమే ఈ క్రెడిట్ కార్డు ద్వారా లబ్ధి పొందుతున్నారు. మిగతా రైతులు అవగాహన లేక వీటిని పొందలేకపోతున్నారు.




బ్యాంకర్లు కూడా సిబిల్ స్కోరు, ఇతర కారణాలు చూపుతూ కార్డులు ఇవ్వడం లేదు. రైతులందరికీ అవగాహన కల్పించి అర్హులైన వారికి కేసీసీలు జారీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

**ఎలా పొందాలంటే?**కిసాన్ క్రెడిట్ కార్డులకు ఆన్‌లైన్ లేదా నేరుగా అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. నేరుగా అయితే రైతులు తమ ఖాతా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులో లభించే ఫారంలో పూర్తి వివరాలు నమోదు చేసి ఆధార్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డులలో ఏదైనా ఒకదానిని జత చేసి పాస్ ఫొటో, పట్టాపుస్తకం నకలుతో దరఖాస్తు చేసుకుంటే.. పది రోజుల్లో అయిదేళ్ల కాలపరిమితితో క్రెడిట్ కార్డును మంజూరు చేస్తుంది. ఆన్‌లైన్‌లో అయితే సంబంధిత బ్యాంక్ వెబ్‌సైట్లో కిసాన్ క్రెడిట్ కార్డు ఆప్షన్‌లో అడిగిన వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

# పీఎస్‌ఆర్ సెంటర్..!

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలోని ప్రధాన వాణిజ్య కేంద్రాల్లో పీఎస్‌ఆర్ సెంటర్‌కు ప్రత్యేకత ఉంది. ఈ కేంద్రం అన్ని వ్యాపారాలకు నిలయంగా మారింది. సూర్యాపేట పట్టణం ఆవిర్భావం నుంచి పీఎస్‌ఆర్ సెంటర్‌లో దొరకని వస్తువు ఉండదు. పట్టణ శివారు ప్రాంతవాసులతోపాటు, చుట్టుపక్కల వారు ఇక్కడికే వస్తుంటారు. తమకు కావాల్సిన వస్తువులను ఖరీదు చేస్తుంటారు. పీఎస్‌ఆర్ సెంటర్‌లో ముఖ్యంగా విద్యుత్తు మోటార్ల మరమ్మతుకు ప్రధాన కేంద్రంగా పేరుగాంచింది. వ్యవసాయ, నివాస గృహాలలోని మోటార్లు మరమ్మతుకు గురైతే ఇక్కడికే వస్తుంటారు. 50 నుంచి 70 మంది



మోటార్ల విక్రయ వ్యాపారులే ఉన్నారు. మిగతా మందులు, కిరాణా, హొటల్, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తుంటారు.

**రోజూ రూ.30 లక్షల వ్యాపారం**

సూర్యాపేటలోని పీఎస్‌ఆర్ సెంటర్‌లో రోజుకు రూ.30 లక్షల వ్యాపారం నిర్వహిస్తుంటారు. మోటారు, దుకాణాలు, మందులు, ఇతరాల విక్రయాలతో ఆదాయం వస్తోంది. ఇక్కడ దుకాణాల్లో వందల మంది ఉపాధి పొందుతున్నారు. మోటారు మెకానిక్ పనులు నేర్చుకుంటున్నారు. ఔషధ దుకాణాలు, ఇతర వాటిల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రత్యేక మోటారు షాపులు ఏర్పాటు చేసుకొని వ్యాపారం సాగిస్తున్నవారు కూడా ఉన్నారు. ఇక్కడికి సూర్యాపేట నియోజకవర్గంతోపాటు చుట్టుపక్కల వారు వచ్చి మరమ్మతు చేయించుకొని వెళ్తుంటారు. ఇక్కడ రోజూ వ్యాపార నిర్వహణతో సందడిగా ఉంటుంది.

# చెర్వుగట్టు వెలిగేట్టు

నార్కట్‌పల్లి : పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి గుహాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. నార్కట్‌పల్లి, చెర్వుగట్టు, నల్గొండలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం 1,80,000 లడ్డూలను, పులిహోర ప్రసాదాలను తయారు చేస్తున్నారు. వసతులు, పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అందమైన చిత్రాలు, తాత్కాలి క మరుగుదొడ్లు 40 వరకు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం నిత్యం పనులను పరిశీలిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బారికేడ్లు, సుమారు 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గుట్టపైకి వాహనాల అనుమతి లేకపోవడంతో గుట్ట కింద మొదటి మార్గం హైదరాబాద్, సూర్యాపేట నుంచి వచ్చే వాహనాలను నార్కట్‌పల్లి మీదుగా నంది విగ్రహాల స్వాగత ద్వార సమీప ప్రాంతాల్లో.. నల్గొండ నుంచి వచ్చే వాహనాలను యల్లారెడ్డిగూడెంలోని స్వాగత ద్వారం పరిసర పాంతాల్లో పార్కింగ్ స్థలాలను కేటాయించారు. సుమారు 50 ఎకరాల్లో మూడు పార్కింగ్ స్థలాలను ఏర్పాట్లు చేస్తున్నారు.

**ప్రతి 10 నిమిషాలకో బస్సు**

చెర్వుగట్టులో ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. మహిళలకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులో ఉచిత ప్రయాణం ఉంటుందని.. నల్గొండ రీజియన్లలో నిత్యం నడుపుతున్న 125 బస్సులతో పాటు అదనంగా 15 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. శైవాలయాల్లో శివరాత్రి రోజున కల్యాణం నిర్వహిస్తుంటారు. చెర్వుగట్టు దేవాలయంలో మాత్రం ఏటా మాఘశుద్ధ సప్తమి (రథసప్తమి) ఘడియల్లో కల్యాణం నిర్వహించడం విశేషం.

ఏర్పాట్లు పూర్తి - సిరికొండ నవీన్‌కుమార్, ఈవో గత బ్రహ్మోత్సవాల లోపాలను సరిదిద్దుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. పారిశుద్ధ్యం, మంచి నీరు, మరుగుదొడ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తాం.




## పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు హమాస్.. హైఅలర్ట్‌లో నిఘా వర్గాలు..!

ఇజ్రాయెల్ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్న పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ ఇప్పుడు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అడుగుపెట్టబోతోందని ప్రచారం జరుగుతోంది. దీంతో భారత నిఘా వర్గాలు ఒక్కసారిగా అప్రమత్తం అయ్యాయి. కశ్మీర్ సంఘీభావ దినం సందర్భంగా బుధవారం పీవోకేలో 'అల్ అక్సా ఫ్లడ్స్' పేరిట ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో హమాస్‌కు చెందిన సీనియర్ నేత ప్రసంగించనున్నట్లు తెలుస్తోంది. ఈ సభను రావల్కోట్‌లోని సబీర్ స్టేడియంలో ఏర్పాటుచేశారు. దీనిలో ఉగ్రసంస్థలైన లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, సీనియర్ నాయకులు కూడా పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో హమాస్ ప్రతినిధి ఖలీద్ కద్దామి ప్రసంగించనున్నట్లు కరపత్రాలు, ఇతర మార్గాల్లో ప్రచారం చేస్తున్నారు. అతడు కశ్మీర్‌లో పోరాటాన్ని పాలస్తీనాతో ముడిపెట్టి మాట్లాడొచ్చని ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. జిహాదీ సంస్థలు తమ వాదనలకు బలం చేకూర్చేలా వాదనలు సృష్టించేందుకు దీనిని వాడుకోవచ్చు. మసూద్ అజర్ సోదరుడు తల్హాసైఫ్, అస్గర్‌ఖాన్, ఇలియాస్ మసూద్ వంటి ఉగ్రవాదులు సభకు హాజరుకావచ్చని చెబుతున్నారు. ఈ సమయంలో భారత హోం మంత్రి అమిత్ షా మంగళవారం జమ్మూకశ్మీర్‌పై హైలెవల్ మీటింగ్‌ను నిర్వహించారు. అక్కడి భద్రతా పరిస్థితులను, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్ల పరిస్థితిని ఆయన పర్యవేక్షించారు. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, సీమాంతర చొరబాట్లను అడ్డుకోవడం వంటి అంశాలపై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. కశ్మీర్‌లో వాహన తనిఖీలను కూడా తీవ్రతరం చేయాలని ఆదేశించారు. గతేడాది ఆగస్టులో హమాస్ నేతలతో లష్కరే ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ భేటీ అయ్యాడు. ఖతార్ రాజధాని దోహా దీనికి వేదికైంది. 2018లో సైఫుల్లాను అమెరికా ఉగ్రజాబితాలో చేర్చింది. లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అతడు సన్నిహితుడు.




## క్రికెటర్ గొంగడి త్రిషకు రూ.కోటి నజరానా.. ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని భారత మహిళా క్రికెటర్ గొంగడి త్రిష మర్యాదపూర్వకంగా కలిశారు. ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన త్రిషను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆమెకు రూ.కోటి నజరానా ప్రకటించారు. అండర్ 19 ప్రపంచకప్ టీమ్‌లో మరో సభ్యురాలు ధ్రుతి కేసరి, టీమ్ హెడ్‌కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి రూ.10 లక్షల చొప్పున ప్రకటించారు. త్రిషను సత్కరించిన సీఎం.. భవిష్యత్‌లో దేశం తరఫున మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. టీ20 వరల్డ్‌కప్ టోర్నీ ఆరంభం నుంచి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో త్రిష అదరగొట్టింది. టీమ్‌ఇండియా కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించింది.




## కర్ణాటక హైకోర్టులో విజయ్ మాల్యా పిటిషన్.. బ్యాంకులకు నోటీసులు

ఢిల్లీ: బ్యాంకులకు రూ.వేల కోట్ల రుణాలను చెల్లించకుండా దేశం వదిలి పారిపోయిన విజయ్ మాల్యా కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. తాను తీసుకున్న రుణాలకు అనేక రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయని.. అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తనతో పాటు ప్రస్తుతం లిక్విడేషన్‌లో ఉన్న యూబీహెచ్ఎల్ తదితర సంస్థల నుంచి వసూలు చేసిన మొత్తాల వివరాలను అందించాలని కోరారు. తాజాగా న్యాయస్థానం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మాల్యా తరఫు న్యాయవాది తన వాదనలు వినిపించారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ సుమారు రూ.6,200 కోట్ల రుణాన్ని తీసుకోగా.. దీనికి సంబంధించి రూ. 14 వేల కోట్లను రికవరీ చేసినట్లు తెలిపారు.

"ఈ విషయం గురించి లోక్‌సభలో ఆర్థిక మంత్రి తెలియజేశారు. మాల్యాకు చెందిన రూ.14, 131 కోట్ల విలువైన ఆస్తులను బ్యాంకులు రికవరీ చేశాయని ఆమె తెలిపారు. ఆయన తీసుకున్న రుణంలో దాదాపు రూ.10, 200 కోట్లు చెల్లించినట్లు రికవరీ అధికారి కూడా తెలిపారు. పూర్తి రుణం చెల్లించినప్పటికీ.. ఇంకా రికవరీ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. మాల్యాకు సంబంధించిన రికవరీ చర్యలపై స్టే విధించాలని కోర్టును కోరుతున్నాను. దీనికి సంబంధించి అన్ని బ్యాంకు నుంచి అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలి" అని న్యాయవాది అభ్యర్థించారు. వాదనలు విన్న న్యాయస్థానం.. ఈ అంశంపై స్పందించాలంటూ ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకు సహా 10 బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 13లోగా స్పందన తెలియజేయాలంటూ గడువు విధించింది. ఇదిలా ఉండగా.. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాల విషయంలో మోసం చేసినట్లు విజయ్ మాల్యా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశం విడిచి వెళ్లిపోయిన ఆయన మార్చి 2016 నుంచీ బ్రిటన్‌లో నివసిస్తున్నారు. మాల్యాను భారత్‌కు రప్పించడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ఆయన హైకోర్టును ఆశ్రయించగా.. బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చింది.




హైదరాబాద్: కాంగ్రెస్‌లో ఎంతటివారైనా పార్టీ నియమాలకు కట్టుబడి ఉండాల్సిందేనని, పార్టీ నియమాలు పాటించని వారిపై చర్యలు ఉంటాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ కమిటీలో 50-60 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉంటారని తెలిపారు. మెజార్టీలుగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయంగా న్యాయం జరగటం లేదన్నారు. "కులగణన సర్వే కోసం బీసీ సంఘాలు చాలా ఏళ్లు ఎదురుచూశాయి. గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందించాలి. భవిష్యత్‌లో జరిగే జనాభా గణనలోనూ కులగణన అంశాన్ని చేర్చాలి. కేంద్రం చేసే జనగణనలో కులగణన కూడా చేస్తానని భాజపా చెప్పాలి.

రాష్ట్రంలో 3.66 శాతం మంది మాత్రమే సర్వేలో పాల్గొనలేదు. వివరాలు ఇవ్వనివారు హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉన్నారు. ఇప్పటి వరకు ఏ రాష్ట్రమూ చేయని ప్రయత్నం తెలంగాణ ప్రభుత్వం చేసింది. చేసిన వారిని అభినందించాల్సింది పోయి దుష్ప్రచారం చేస్తున్నారు" అని మండిపడ్డారు.

## ఇలాంటి దృశ్యాలు చూడలేకపోతున్నాం: కాంగ్రెస్

ఢిల్లీ: అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను అమెరికా ప్రత్యేక విమానాల్లో భారత్‌కు తరలిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ భారతీయుల చేతికి సంకెళ్లు వేసి..వారిని నేరస్థులుగా పంపడం అవమానకరమని పేర్కొంది. ఓ భారతీయుడిగా అలాంటి దృశ్యాలు చూడలేకపోతున్నానని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో భారత దౌత్యవేత్త దేవయాని ఖోబ్రగాడేకు అమెరికాలో ఎదురైన అవమానాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. 2013లో న్యూయార్క్‌లో దౌత్య కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఓ వీసా వ్యవహారంలో ఆమెను అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి..అవమానించిన విషయం తనకు జ్ఞాపకానికి వస్తోందని అన్నారు. ఆ విధంగా ప్రవర్తించినందుకు అదే సమయంలో దేశంలో పర్యటించిన అమెరికా కాంగ్రెస్ ప్రతినిధి బృందాన్ని కలవడానికి అప్పటి యూపీఏ ప్రభుత్వ నేతలు నిరాకరించారని అన్నారు. యూఎస్ ఎంబసీకి ఇచ్చిన అనేక ప్రోత్సాహకాలను భారత్ ఉపసంహరించుకుందని పేర్కొన్నారు. కాగా అమెరికా నుంచి అక్రమ భారతీయ వలసదారులను తీసుకువస్తున్న ఈ విమానం మొదటిది కాదని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. వాస్తవాలు బయటకు రాకుండా భాజపా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో కూడా 1100 మంది భారత అక్రమ వలసదారులను అమెరికా నుంచి బహిష్కరించారని..కానీ వారి వివరాలు వెల్లడించలేదని పేర్కొన్నారు. 2022 నాటికి యూఎస్‌లో 725,000 మంది భారతీయ అక్రమ వలసదారులు ఉన్నట్లు పలు నివేదికలు వెల్లడించాయని చెప్పారు. అక్రమవలసదారులపై మొదటి నుంచి కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కడ అక్రమంగా ఉంటున్న విదేశీ వలసదారులను స్వదేశాలకు పంపుతున్నారు.




## లావణ్యను చంపేందుకు మస్తాన్ సాయి ప్లాన్.. రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

హైదరాబాద్: యువతుల ప్రైవేటు వీడియోలను సేకరించి బెదిరింపులకు పాల్పడుతున్న వ్యవహారంలో అరెస్టయిన మస్తాన్ సాయి రిమాండ్ రిపోర్టులో పోలీసులు కీలక విషయాలు పేర్కొన్నారు. లావణ్యను చంపేందుకు అతడు ప్లాన్ చేసినట్లు పేర్కొన్నారు. మస్తాన్‌సాయి, అతడి స్నేహితుడు ఖాజాకు డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు నిర్ధరణ అయినట్లు రిమాండ్ రిపోర్టు ద్వారా వెల్లడైంది. డ్రగ్స్ మత్తులో లావణ్య ఇంటికి మస్తాన్ సాయి వెళ్లి గొడవ చేశాడు.

అతడిపై ఎన్డీపీఎస్ సెక్షన్‌ను కూడా పోలీసులు జోడించారు. మస్తాన్ సాయి ల్యాప్‌టాప్‌లో ఉన్న లావణ్య వీడియోలను రాజ్‌తరుణ్ గతంలోనే తొలగించాడు. అయితే ఆలోపే ఇతర డివైస్‌లలోకి ఆ వీడియోలను మస్తాన్ సాయి కాపీ చేసుకున్నాడు. లావణ్యను పలు మార్లు చంపేందుకు అతడు యత్నించాడు. హార్డ్ డిస్క్ కోసం ఆమెను చంపేందుకు ప్లాన్ చేసినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. గత నెల 30న లావణ్య ఇంటికి వెళ్లి హత్యాయత్నం చేసినట్లు వెల్లడించారు. మస్తాన్ సాయి అతని స్నేహితులు డ్రగ్స్‌తో పార్టీలు చేసుకున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీకెండ్స్‌లో మస్తాన్ సాయి విల్లాలో భారీగా డ్రగ్స్ పార్టీలు జరిగేవి. మత్తులోకి జారుకున్న తర్వాత యువతులపై లైంగిక దాడికి పాల్పడేవాడు.

వారితో గడిపిన సమయంలో వీడియోలు రికార్డు చేసుకున్నాడు. కొందరు యువతులు డ్రగ్స్ తీసుకుంటున్నప్పుడు వీడియోలు రికార్డు చేశాడు. అతడి హార్డ్ డిస్క్‌లో వీటిని గుర్తించారు. ప్రస్తుతం నిందితుడి సెల్ ఫోన్, హార్డ్ డిస్క్‌ను ఎఫ్ఎస్ఎల్ టీమ్ విశ్లేషిస్తోంది.

## కులగణన సర్వే అడ్డుకోవడానికి భారాస కుట్ర: పొన్నం




హైదరాబాద్: కులగణన జరగకుండా చేయాలని భారాస కుట్ర చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. భారాసలో మూడు కీలక పదవులు ఒకరికే ఉండటంపై ఎందుకు మాట్లాడరని నిలదీశారు. కులగణనలో పాల్గొనని వారికి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కులగణన సర్వే ద్వారా బలహీన వర్గాలకు ఒక రోడ్ మ్యాప్ తయారైందని పొన్నం పేర్కొన్నారు. కులగణనలో ఏం పొరపాటు జరిగిందో చెప్పాలని.. బాధ్యతగా తీసుకొని సరిచేస్తామన్నారు. డిక్లరేషన్ ప్రకారమే అన్ని హామీలు అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు.

## బీసీ డిక్లరేషన్.. కాంగ్రెస్ హామీలు, ప్రకటనలన్నీ రాజకీయ నాటకాలే: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. దీనిపై ఆ పార్టీకి స్పష్టత లేదన్నారు. మంగళవారం సమర్పించిన డేటాపై ప్రభుత్వానికి అవగాహన లేదని పేర్కొన్నారు. "కాంగ్రెస్‌కు 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం లేదని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా యూటర్న్ తీసుకుని నెపాన్ని కేంద్రంపై నెడుతున్నారు. ఆ పార్టీ హామీలు, ప్రకటనలన్నీ రాజకీయ నాటకాలే అని రుజువైంది. రాహుల్ గాంధీ తన పేరును ఎన్నికల గాంధీగా మార్చుకోవాలి" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194



PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660